క్లుప్తంగా

ఆర్థికసాయం



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న రమణయ్యగౌడ్

కేశంపేట: మండల కేంద్రానికి చెందిన జూలపల్లి సుగుణమ్మ అకస్మాత్తుగా మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం గ్రామానికి చెందిన గుండ్రాతి రమణయ్యగౌడ్ రూ.5వేలు, పవన్ కుమార్‌రెడ్డి రూ.3వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు జూలపల్లి అనసూయ, అంజయ్య, వెంకటయ్య, యాదయ్య, దశరథ్, శేఖర్, కృష్ణయ్య, రమేశ్, నారాయణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఆస్పత్రులు నడిపిస్తే చర్యలు



ల్యాబ్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

కొందుర్గు: అనుమతులు లేకుండా ఆసుపత్రులు, ల్యాబ్‌లు నడిపితే చర్యలు తప్పవని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి హెచ్చరించారు. సోమవారం ఆమె చౌదరిగూడ, పద్మారం ఆరోగ్య ఉపకేంద్రాలను సందర్శించి అక్కడ సిబ్బంది పనితీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చౌదరిగూడ, లాల్‌పహాడ్ గ్రామాల్లో ప్రయివేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లను పరిశీలించారు. చౌదరిగూడలో దుర్గా ల్యాబ్‌కు అనుమతులు లేకపోవడంతో ల్యాబ్‌ను మూయించారు. ల్యాబ్ నిర్వాహకులు తాము అనుమతుల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నామని, చలానా సైతం చెల్లించామని తెలుపడంతో సదరు పత్రాలు చూయించాలని ఆదేశించారు. అంతవరకు ల్యాబ్ తెరవకూడదని, నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై ఎన్యూమరేటర్లకు శిక్షణ



ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇస్తున్న అధికారులు

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సామాజిక ఆర్థిక, ఉపాధి, విద్య, కులగణనకు సంబంధించి ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ హిమబిందు, ఎంపీఓ విఠలేశ్వర్‌జీ, ఎంఈఓ పురన్‌దాస్, తహసీల్దార్ కృష్ణయ్యల ఆధ్వర్యంలో మండలంలోని ఎన్యూమరేటర్లకు ఈ సర్వేపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ నెల 6 నుంచి 30వ తేవరకు ఈ సర్వే జరుగుతుందని తెలిపారు.మండలంలో నిర్వహిస్తున్న ఈ సర్వేకు 146 మంది ఎన్యూమరేటర్లను ఎంపిక చేశారని, ఇందులో 74 మంది ఉపాధ్యాయులు కాగా మిగతా వారు అంగన్‌వాడీ టీచర్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. సర్వేకు సంబంధించి అంశాలను గ్రామాల వారీగా చేపట్టాల్సిన వివరాలను ఎన్యూనేటర్లకు వివరించారు. ఈ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు ఉన్నారు.

కులగణనతోనే సామాజిక న్యాయం

ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



కేశంపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: కులగణనతోనే సామాజిక న్యాయం జరుగుతుందని, అందుకు అందరూ సహకరించాలని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుల గణనను దేశంలోనే మొదటిసారిగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్నా నేటికీ సమాజంలో అన్నివర్గాల వారికి న్యాయం జరగడం లేదన్నారు. అసమానతలు లేని దేశంగా మార్చాలనే రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారానే నేను ఎమ్మెల్యేగా గెలిచానని ఆయన గుర్తుచేశారు. దేశం అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందన్నారు. రాజకీయం, ఆర్థికంగా అందరికీ సమాన ఫలాలు అందాలంటే కులగణనతోనే సాధ్యమవుతుందన్నారు. తెలంగాణ అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురైందని గుర్తించిన సోనియాగాంధీ యూపీఏ ప్రభుత్వ చైర్‌పర్సన్‌గా ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిందన్నారు. గాంధీ కుటుంబం దేశం కోసం నిస్వార్థంగా సేవలు చేస్తుందన్నారు. గత ఎన్నికల సమయంలో కులగణనను చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని, ఇచ్చిన హామీని అమలు చేస్తున్నామన్నారు. నేడు హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో నిర్వహించే కులగణన సంప్రదింపుల సదస్సుకు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ వస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, సబ్బండ వర్గాలను గత ప్రభుత్వం మోసం చేసిందని ఆయన అన్నారు. కార్యకర్తలు, నాయకులు కులగణన కార్యక్రమంలో పాల్గొని సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా మాజీ చైర్‌పర్సన్ తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, జగదీశ్వర్, శ్రీధర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, విశ్వం, తాండ్ర కృష్ణారెడ్డి, సుందరయ్య, శివయ్య, ప్రభాకర్‌జీ, నర్సింలు, రాఘవేందర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తాం

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ప్రభుత్వం పెంచిన మెస్, కాస్మోటిక్ చార్జీలను పట్టణంలో గల బాలికల వసతి గృహంలోని విద్యార్థినిలకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. విద్యార్థులకు కావాల్సిన వసతులను కల్పించడంలో విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అందులో భాగంగానే అన్ని మౌలిక సదుపాయాలతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మించడంతో పాటుగా విద్యారంగంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థినిలతో కలిసి వసతి గృహంలో భోజనం చేశారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ అలీఖాన్ బాబర్, చెంది తిరుపతిరెడ్డి, అందె మోహన్, బాల్‌రాజ్‌గౌడ్, ముబారక్, ఖదీర్, మాధవులు, పురుషోత్తంరెడ్డి, రవి, లింగారెడ్డిగూడ అశోక్, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లలో బీఆర్‌ఎస్ చేసింది శూన్యమే



మాట్లాడుతున్న నర్సింహయాదవ్ తదితరులు

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్

నందిగామ: పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ రాష్ట్రాభివృద్ధికి చేసింది ఏమిలేదని, అలాంటి బీఆర్ఎస్ నాయకులు 11 నెలల కాంగ్రెస్ పాలన గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్ విమర్శించారు. మండల కేంద్రమైన నందిగామలో పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 11 నెలల కాలంలో రైతు రుణమాఫీ చేసిందని, మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించే పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు. అదేవిధంగా ఉచిత విద్యుత్, గ్యాస్ సిలిండర్లకు రాయితీ సౌకర్యాన్ని కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలలో భాగంగా మరికొన్ని పథకాలు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనుందన్నారు. రాష్ట్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిషలు కృషి చేస్తున్నా బీఆర్ఎస్ నాయకులు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం సర్పంచ్‌లతో పనులు చేయించుకొని బిల్లులు చెల్లించలేదని, బిల్లులు అడిగిన సర్పంచ్‌లను అప్పట్లో కేసులు పెట్టి జైళ్లలో వేశారని గుర్తుచేశారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు బుద్ధి తెచ్చుకొని ప్రవర్తించాలని హితవు పలికారు. సమావేశంలో ఎంపీటీసీల సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, మాజీ ఎంపీటీసీలు దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, పసుల బుచ్చయ్య, సత్యనారాయణ, మహేందర్, విజయ్‌నాయక్, చించేటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: పట్టణంలోని 9వ వార్డులో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.15లక్షలతో నూతనంగా డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు కమిషనర్ వెంకన్న తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, బాబర్‌ఖాన్, చింటు, దంగు శ్రీనివాస్‌యాదవ్, చంద్రశేఖర్, బస్వం, దర్శన్, ముబారక్, మాధవులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి

ఎంపీఓ విఠలేశ్వర్‌జీ

సాక్షి ఎఫెక్ట్..



చేవెళ్లలో రోడ్డుపక్కన ఉన్న చెత్తను తొలగించిన సిబ్బంది

చేవెళ్ల: గ్రామాలను ఎప్పటికప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులకు సూచించినట్లు మండల ఎంపీఓ విఠలేశ్వర్‌జీ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల తీరును మండల ఎంపీఓ విఠలేశ్వర్‌జీ సోమవారం పరిశీలించారు. సాక్షిలో ఈ నెల 3వ తేదీన 'పడకేసిన ప్రత్యేక పాలన' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా అధికారుల ఆదేశాలతో సోమవారం మండలంలోని గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పారిశుద్ధ్య పనులను పరిశీలించి వీధులను శుభ్రం చేయించారు. మండల ఎంపీఓ విఠలేశ్వర్‌జీ ప్రత్యేకంగా అన్ని గ్రామాల్లో తిరుగుతూ పారిశుద్ధ్య పనులు, గ్రామాల్లో ఉన్న సమస్యలపై ఆరా తీశారు. మండల కేంద్రంలో రోడ్లపక్కన, దుకాణాల పక్కన వేసిన చెత్తాచెదారాలను తొలగించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా విఠలేశ్వర్‌జీ మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారుల ఎప్పటికప్పుడూ పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారన్నారు. ప్రజలు సహకరించాలన్నారు. చెత్తను సేకరించి డంపింగ్‌యార్డులకు తరలిస్తున్నా కొంత మంది నిర్లక్ష్యంగా చెత్తలను డస్టిబిన్‌లలో వేయకుండా రోడ్ల వెంట పడేస్తున్నారన్నారు. దీంతో చేత్త సేకరించిన కొన్నిచోట్ల ఇలా జరుగుతుండటంతో మళ్లీ ఉదయం పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నారన్నారు. మండల కేంద్రంలో వ్యాపారులు వారి దుకాణాల పక్కనే చెత్తాచెదారం వేస్తుండటంతో వాటిని పరిశీలించి దుకాణాదారులకు పలువురికి జరిమానాలు కూడా విధించామన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



పూజల్లో పాల్గొన్న అందె బాబయ్య

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో పార్వతీరాజరాజేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గత మూడురోజులుగా ఆలయంలో బ్రాహ్మణుల వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు కొనసాగాయి. ఆయా పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు బాబయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు రఘురాంగౌడ్, తాండ్ర కృష్ణారెడ్డి, అబ్బి సుందరయ్య, ప్రభాకర్ జీ, యాదయ్య, నర్సింలు, రాఘవేందర్, దేవేందర్, రవీందర్ పాల్గొన్నారు.

పండుగలను కలిసిమెలసి జరుపుకోవాలి



సదర్ ఉత్సవంలో పాల్గొన్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: పండుగలను అందరూ కలిసిమెలసి ఉత్సాహంగా జరుపుకోవాలని అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవియాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ ఆవరణలో దున్నపోతుల సదర్ ఉత్సవాన్ని గ్రామానికి చెందిన దోమ మల్లేశ్, దిలీప్‌యాదవ్‌లు ఘనంగా నిర్వహించారు. గత 12 సంవత్సరాల నుంచి దిలీప్‌యాదవ్ ఆధ్వర్యంలో దున్నపోతుల సదరు కొనసాగుతోంది. ఈ దున్నపోతుల సదర్ ఉత్సవానికి రవియాదవ్, మాజీ సర్పంచ్ మంజుల పాల్గొని దున్నపోతులకు పూలు శాలువాలతో సన్మానించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రవియాదవ్ మాట్లాడుతూ.. సదర్ ఉత్సవాలు ప్రతీ దీపావళి పండుగ అనంతరం గ్రామాల్లో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. బ్యాండ్ మోతలు, డీజే పాటలు దున్నపోతుల విన్యాసాలతో సదర్ ఉత్సవం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఇలాంటి పండుగలను అందరూ కలిసిమెలసి జరుపుకోవాలని కోరారు. ప్రభుత్వం సదర్ ఉత్సవాలను ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు. ఈ సదర్ ఉత్సవాల్లో దిలీప్‌యాదవ్, దోమ మల్లేశ్, ముదిగొండ మహేందర్‌యాదవ్, సత్తయ్యయాదవ్, వెంకటేశ్‌యాదవ్, జెల్లల మల్లేశ్ యాదవ్, షాబాద్ గిరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



షాబాద్: ఏట్లఎర్రవల్లిలో పశువుకు టీకా వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి, పోతుగల్, కేశవగూడ, సాయిరెడ్డిగూడ గ్రామాల్లో సిబ్బందితో కలిసి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యం పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించాలి



శంకర్‌పల్లి: మియాఖాన్‌గడ్డలో పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ శ్రావణి

శంకర్‌పల్లి: పశువుల్లో వచ్చే వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, సరైన చికిత్స అందించాలని మహారాజ్‌పేట్ పశు వైద్యురాలు శ్రావణి అన్నారు. సోమవారం మండలంలోని మియాఖాన్‌గడ్డ గ్రామంలో సుమారు 300ల పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గాలికుంటు సోకిన పశువుల్లో నోట్లో, గిట్టల్లో పుండ్లు ఏర్పడతాయని, జ్వరం ఉండడంతో మేత మేయదన్నారు. పాడిరైతులు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ఆనంద్, శ్వేత, రజిత, సుప్రియా తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి

షాబాద్: దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని షాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో హైతాబాద్ గ్రామస్తులు దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాలని ఆయనను ఆహ్వానించారు. అనంతరం ఆయన హైతాబాద్‌లో గల మహంకాళి, బీరప్ప, మల్లన్న దేవాయాల అభివృద్ధికి తనవంతు సహాయంగా రూ.1లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత కలుగుతుందని తెలిపారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీవరకు నిర్వహించే విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు చాంద్‌పాషా, సూద యాదయ్య, గోపాల్ తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



మధుమేహంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

మొయినాబాద్: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని శ్రీరాంనగర్ మాజీ సర్పంచ్ సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో ఆదివారం శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని జిమ్స్ హోమియోపతిక్ మెడికల్ కళాశాల, ఆస్పత్రి ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అదేవిధంగా మధుమేహం, ఇతర ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. అప్పుడప్పుడూ వైద్య పరీక్షలు చేయించుకొని, వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సుమారు వంద మందికి మధుమేహం పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు విరాజ్‌కుమార్, హనుమంతు, పావని, జిమ్స్ పీజీ డాక్టర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు



షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

షాద్‌నగర్: పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని కోరితే ప్రభుత్వం పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించడం సరికాదని మాజీ సర్పంచ్‌లు అన్నారు. సోమవారం పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు మాజీ సర్పంచ్‌లు శ్రీశైలంయాదవ్, పల్లె శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మణ్‌నాయక్, రాములునాయక్, శివజ్యోతి, మాధవిరంగయ్యలు చలో హైదరాబాద్‌కు వెళ్తుండగా షాద్‌నగర్‌లో పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని కోరితే ప్రభుత్వం పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించడం సరికాదన్నారు. పెండింగ్ బిల్లులను మంజూరు చేసి పల్లెల అభివృద్ధికి కృషి చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. మాజీ సర్పంచ్‌ల అరెస్టును మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డిలు ఖండించారు. అక్రమ అరెస్టులు సరికాదన్నారు.

నందిగామలో..



నందిగామ: అరెస్టయిన మాజీ సర్పంచ్‌లు

నందిగామ: హైదరాబాద్‌లో నిరసన కార్యక్రమానికి వెళ్తున్న మండలంలోని పలువురు మాజీ సర్పంచ్‌లను సోమవారం నందిగామ పోలీసులు ముందస్తుగా అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం మధ్యాహ్నం తర్వాత సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో నందిగామ, బండోనిగూడ, సర్వప్పగూడ, అప్పారెడ్డిగూడ మాజీ సర్పంచ్‌లు వెంకట్‌రెడ్డి, కుమార్, గోవిందు అశోక్‌కుమార్, జెకె నర్సింహ, చేగూరు మాజీ పీఏసీఎస్ చైర్మన్ విఠల్ తదితరులు ఉన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: చలో హైదరాబాద్‌కు వెళ్తున్న మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్‌రెడ్డి, కమ్మెకర్ నవీన్‌కుమార్, ఆంజనేయులు కేశంపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. వీరిని స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

ముందస్తు అరెస్టులు అక్రమం



కొందుర్గులో అరెస్ట్ అయిన మాజీ సర్పంచ్‌లు

కొందుర్గు: హైడ్రాబాద్‌లో నిరసన కార్యక్రమానికి వెళ్తున్న కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాలకు సంబంధించిన వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లను సోమవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ.. తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు అడిగితే ఇలా అరెస్ట్ చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వమేనా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, లేనిచో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు నర్సింహారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, ఆంజనేయులు, నర్సింలు తదితరులు ఉన్నారు.